## అలవాటు బలిమి

వంటింట్లో పీట; కొళాయిలోంచి చల్లని నీరు, స్వచ్ఛమైన నీరు, గోరు వెచ్చని నీరు, సువాసనల నీరు ప్రవహిస్తోంది. ఈ మంచం ఒకరికి వలెనే ఇద్దరికీ చాలు. మొగ్గ తర్వాత రేకు, రేకు తర్వాత పువ్వు. వాన తర్వాత ఎండ. వేళయింది కాబట్టి కళ్లు విడిపడుతాయి, శరీరం నిలబడుతుంది, చెయ్యి బారచాచుకుంటుంది, నిప్పు రాజుకుంటుంది, కడచిన రాత్రి ముదతలతో వాటి అమాయికపు వంపుకోసం చిరునవ్వు పెనగులాడుతుంది. అవిగో తెరచుకుంటూన్న గడియారపు ముళ్ళు, అవీ నిలబడతాయి. ఒళ్లు విరుచుకుంటాయి, తమ్మె తాము వెలిగించుకుంటాయి, చిరునవ్వు వచ్చే వేళ సూచిస్తాయి. తెల్లరవిక తొడుక్కుని సూర్యకిరణం ఇంట్లో తిరుగాడుతుంది. మళ్ళీ మంచుకురవవచ్చు. సుమారు అయిదు గంటలకి మళ్ళీ కొద్దిగా నెత్తురుబొట్లు వర్షిస్తాయి. సరే దానికేం లే! హో! నాకు భయంవేసింది. హఠాత్తుగా, హఠాత్తుగా అనుకున్నాను కిటికీ అవతల వీధి లేదని. కాని ఎప్పటిలాగ అది అక్కడే వుంది. మందుల షాపు వాడు తాళం తీస్తున్నాడు కూడా. ఇంతట్లోకే మిల్లు దగ్గర కంబె చక్రం దగ్గరే ఎక్కువజనం పోగవుతారు. కూలిపనులు సాన బెట్టి, సమ్మెట కొట్టి, సన్నం చేసి, సరఫరా అవుతాయి. పరిచితమైన పనిముట్టులో ప్రశాంతమైన నిద్రాసౌఖ్యం అనుభవిస్తూ మానవహస్తం ఇంకోసారి మహదానందం పొందుతుంది.

చిరకాలం ఈ మురిపెం సాగితే మాట—అద్దం అద్భుతమైన సాక్ష్యం— అనుక్షణం మారిపోతూ శాంతంగా, పటిష్ఠంగా సాక్ష్యం ఇస్తుంది. అయితే అది వాఙ్మాలం ఇవ్వడం ముగించే సరికి మళ్ళీ మొదటికే వచ్చిందని గ్రహించగలవు ఈనాటి వాస్తవికతకు అది ప్రతినిధి.

భయంకరమైన మలుపు తిరిగే బాటమీద, ఇవాళలాగే రేపునికూడా ఉల్లాకు వేసేవాడి కాళ్ళకి గట్టిగా కట్టబడి, నిర్లక్ష్యపు తేలిక రెక్కలమీద దినదినం ఒకవెయ్యి పదచిహ్నాలు నిరీక్షిస్తుంటాయి. ఇంతకు ముందు వచ్చినవే అవి, ఇక మీద కూడా వస్తాయి పిలుపు అక్కర్లేకుండా. ఆ దారినే అందరూ వెళ్ళారు తమ సుఖంనించి తమ

దుఃఖందాకా. ఒక పెద్ద కాగడావున్న ఒక చిన్న ఆశ్రమం అది. ఒక కాలు దీసి ఇంకొకటి వేస్తావు. తర్వాత మాయమైపోతావు.

గోడలు బొమ్మలతో అలంకరించుకుంటాయి; పుష్పస్తబకాలతో ఆటవిడుపు రోజులు కేటాయించుకుంటాయి; ఆవిరితో తన్ను కప్పుకుంటుంది అద్దం. సెలఏటి మీద దీపగృహాలెన్నో. నదీ కలశంలోది సెలయేరు. రెండు కళ్ళూ ఒకమాదిరివే. నీ ఒకే ఒక ముఖానికోసం, రెండుకళ్ళనీ ఒకే మాదిరి చీమలు కప్పుతాయి. చెట్లన్నీ పసుపు రాసుకున్నాయి. పిట్టల్ని వెంటబెడుతోంది గాలి. రాళ్ళు చస్తే ఎవరూ ఏడవరు. ఫలితం బద్ధలయిన జంతువుకాదు. జంతువుల్ని మచ్చిక చేసేనియంత. అబ్బా అప్పుడే ఉత్సవం ప్రారంభమయిందా? మొత్తం మీద వైభవంగానే ఉంది. ఆగకుండా పేలే ఈ పిస్తోలు వల్లనే పూలకుండల్లో పువ్వులూ, నోట్లో పొగా బయలుదేరుతాయి.

ప్రేమ, ఆఖరికి, రాత్రిని స్పష్టంగా చూడటంతో సంతృప్తిచెందుతుంది.

నువ్వు వెళ్ళిపోయినచోట నన్ను వెదుక్కుంటూ నిలుస్తుంది నీ పరిమళం. నీ దౌర్బల్య సందేశం పునః ప్రతి గ్రహణ పొందాలని వెనక్కి తిరిగి వస్తాను. నీ చేతిలో నా చెయ్యిలాగ లేదేం నా చేతిలో నీ చెయ్యి? దుర్భర దుఃఖం కూడా బోధపడ్డ మీద లాభిస్తుంది. నా అదృష్టం నీకు పంచిపెడతాను. అక్కడ నువ్వు లేకపోవడం లేదు. నా అస్తిత్వానికి నువ్వు తార్కాణ. నిన్ను నిలబెట్టుకోవాలని నేనే జీవితాన్ని ప్రోదిచేసుకున్నానో దానికే అన్నీ అన్వయిస్తాయి.

ఏమి టాలోచిస్తున్నావు?

ఏమీ లేదు.

(Breton, Eluard ఇద్దరూ కలిసి రచించిన "The Immaculate Conception" నుంచి)

ముద్రణ: ఢంకా 1945 మే